AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
28-10-2025 (Tuesday) MAIN EDITION

## గన్నవరం ఎయిర్‌పోర్టులో అగ్నిప్రమాదం..




**అక్షరటుడే, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కస్టమ్స్ అధికారుల గదిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మంటల్లో సాఫ్ట్‌వేర్ పరికరాలు, ఇమ్మిగ్రేషన్ గదిలో స్ప్లిట్ ఎయిర్ కండిషనర్ కస్టమ్స్ అధికారులకు చెందిన లగేజ్ బ్యాగులు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

## బీఎస్ఎన్ఎల్‌కు కొత్తగా 5 లక్షల కస్టమర్లు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రభుత్వ సహకారంతో భారత్ సంచార్ నిగం లిమిటెడ్ తన సేవలను విస్తరిస్తోంది. ప్రైవేట్ టెలికాం ఆపరేటర్లకు పోటీ ఇచ్చే దిశగా ఎదుగుతోంది. ఇతర ఆపరేటర్లతో పోల్చితే ఈ ప్లాన్లు చౌకగా ఉండడంతో బీఎస్ఎన్ఎల్‌లోకి పోర్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బీఎస్ఎన్ఎల్ కస్టమర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ట్రాయ్ నివేదిక ప్రకారం సెప్టెంబర్‌లో ఐదు లక్షల కొత్త సబ్‌స్క్రైబర్లు చేరారు. దీంతో బీఎస్ఎన్ఎల్ సంస్థ ఎయిర్‌టెల్‌ను వెనక్కి నెట్టింది.

## అమెరికాకు షాకిచ్చిన రష్యా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాకు రష్యా షాక్ ఇచ్చింది. అగ్రరాజ్యంతో ఉన్న కీలకమైన ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తీరుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశంతో ఉన్న ప్లుటోనియం ఒప్పందాన్ని రష్యా రద్దు చేసుకుంది.

## మంత్రులకు డివిజన్ల బాధ్యతలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రులను కేటాయించారు.

## సీసీఐ చైర్మన్‌తో కోమటిరెడ్డి భేటీ




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. వర్షాలతో పత్తి పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. తేమశాతం 14 ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. మద్దతు ధర పెంచాలని, అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## లొంగిపోయిన మావోయిస్టు నేతలు

**అక్షరటుడే, హైదరాబాద్ :** మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గత కొన్ని రోజులుగా అగ్రనేతలు లొంగిపోతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేతలైన మల్లోజుల, ఆశన్న ఆయుధాలతో సహా లొంగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నేత అయిన బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్, కేంద్ర కమిటీ కీలక సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ చంద్రన్న లొంగిపోయారు. వీరు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మంగళ వారం అజ్ఞాతం వీడారు. వీరి లొంగు బాటులో తెలంగాణ ఐఎస్‌బీ కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. కాగా చంద్రన్న మావోయిస్టు పార్టీ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించారు. అనేక దశాబ్దాలుగా ఉద్యమానికి కీలక మార్గదర్శకుడిగా పనిచేశారు. మావోయిస్టు నేత బండి ప్రకాశ్ తెలంగాణ స్టేట్ కమి టీ మెంబర్‌గా, నేషనల్ పార్క్ ఏరియా ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## కర్ణాటక ప్రభుత్వానికి ఎదురుదెబ్బ..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కర్ణాటక ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఓ ఉత్తర్వుపై కర్ణాటక హైకోర్టు ధార్వాడ్ బెంచ్ మంగళవారం స్టే విధించింది. ప్రభుత్వ ప్రాంగణాల్లో ప్రైవేట్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహించే ముందు.. అనుమతి తీసుకోవాలనే ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా ఆర్‌ఎస్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకునే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వ్యవహారం హైకోర్టుకు చేరడంతో ధర్మాసనం స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



# కాంగ్రెస్‌లో అసంతృప్త జ్వాల

**కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ముఖ్యమంత్రి పనితీరుపై అమాత్యులు, శాసనసభ్యులు రగిలి పోతున్నారు. తమ శాఖల్లో తీవ్ర జోక్యం చేసుకుంటున్నారని కొంత మంది మంత్రులు నొచ్చుకుంటుంటే, కమీషన్లు, కాంట్రాక్టుల విషయంలో సహకరించడం లేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఎమ్మెల్యేలైతే బహిరంగంగానే ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సర్కారును నిందిస్తూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి వారు తరచూ వార్తల్లోకి ఎక్కుతుండగా.. తాజాగా ఆ జాబితాలో మరో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి చేరారు. ఏవైనా పనులు అడిగితే చేయలేని పరిస్థితుల్లో ఉన్న తాము గ్రామాల్లోకి వెళ్లాలంటే ముఖం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేయడం కాంగ్రెస్ ఎమ్మెల్యేల దుస్థితికి అద్దం పడుతోంది.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- రుసరుసలాడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- సర్కారులో కరువైన సమన్వయం
- కమీషన్ల కోసం అమాత్యుల కీచులాట
- కేబినెట్ సహచరుల నడుమ ముడుపుల లొల్లి
- నిధులు ఇవ్వడం లేదని ఎమ్మెల్యేల అలక
- బహిరంగంగానే ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వైనం

కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో సమన్వయం లోపించింది. అందరినీ సమన్వయం చేయాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడలకు పోతున్నారన్న భావన్న అటు మంత్రుల్లో, ఇటు ఎమ్మెల్యేలో పెరిగి పోతోంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని, తమ శాఖల్లో తమకు తెలియకుండానే పనులు జరిగిపోతున్నాయని మంత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఎమ్మెల్యేలు సైతం తమకు నిధులు ఇవ్వడం లేదని, నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి అడిగితే స్పందన రావడం లేదని వాపోతున్నారు. నిధులు ఇవ్వకుండా తాము నియోజకవర్గాల్లో ఎలా తిరగాలని ప్రశ్నిస్తున్నారు.

### ఎమ్మెల్యేల అసంతృప్త రాగం..

ఇక, కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు ఇవ్వక పోవడంపై శాసన సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అధికారంలో ఉన్న పార్టీలో ఉండి కూడా పని చేయలేని తాము ఎమ్మెల్యేలుగా ఉండి ఏం లాభమని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. మంత్రి పదవి రాలేదని ఇప్పటికే తీవ్ర అసంతృప్తిలో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తరచూ ప్రభుత్వంపై నేరుగానే విమర్శలు చేస్తున్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు సైతం సొంత ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి కూడా బహిరంగంగానే తన అసంతృప్తిని వెల్లడించారు. రూ.లక్ష, రూ.2 లక్షల పనులు మంజూరు చేసేందుకు కూడా తమ దగ్గర నిధులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. లక్ష కోట్లు అప్పు తెచ్చి ఏం చేస్తున్నారని సొంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా తమ పరిస్థితి చెప్పుకోలేకుండా ఉందని, నిధులు లేక ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేక పోతున్నారని వాపోయారు.

### రగిలిపోతున్న అమాత్యులు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కొందరు కేబినెట్ సహచరులపై కొందరు మంత్రులు లోలోపల తీవ్రంగా రగిలి పోతున్నారు. పరిధి దాటి వ్యవహరిస్తున్నారని తమ అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ మీడియాకు లీకులు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి నలుగురు, ఐదుగురికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ మిగతా సహచరులను పట్టించుకోవడం లేదని మంత్రులు మండిపడుతున్నారు. ప్రధానంగా బీసీ వర్గానికి చెందిన అమాత్యులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇదే విషయమై గత వారం జరిగిన కేబినెట్ భేటీలో నేరుగా ముఖ్యమంత్రినే ఒకరిద్దరు నిలదీశారు. రవాణా శాఖ మంత్రిగా ఉన్న తనకు తెలియకుండా చెక్‌పోస్టులు ఎలా ఎత్తేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ గట్టిగానే ప్రశ్నించారు. ఇక, దేవాదాయ శాఖ పరిధిలోని మేడారం అభివృద్ధి పనులను మరో శాఖకు అప్పగించడంపైనా మంత్రిమండలి సమావేశంలో వాడివేడి చర్చకు దారి తీసిందని తెలిసింది. బీసీ వర్గానికి చెందిన మహిళా మంత్రిని కావాలనే అవమానించడం సరికాదని బీసీ వర్గ మంత్రులు కేబినెట్ భేటీలో అన్నట్లు ప్రచారం జరిగింది. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన ముఖ్యమంత్రి ఇలా ఒకరిద్దరికే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## కవిత, సీఎం రేవంత్ బిజినెస్ పార్ట్‌నర్లు: ఎంపీ అర్వింద్



**అక్షరటుడే, ఇందూరు:** కల్వకుంట్ల కవిత, సీఎం రేవంత్‌రెడ్డి బిజినెస్ పార్ట్‌నర్లు అని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటే కల్వకుంట్ల కుటుంబం సహించదని విమర్శించారు. నిజామాబాద్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను గత ప్రభుత్వం అణగదొక్కేందుకు ప్రయత్నించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలను కేసీఆరే నిలిపేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినప్పటికీ ఎందుకు ఆమోదించడం లేదని ఎంపీ అర్వింద్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కవిత ఇద్దరూ బిజినెస్ పార్టనర్లు కాబట్టే ఆమె రాజీనామా ఆమోదం పొందడం లేదన్నారు.

## బీఆర్ఎస్‌కు సీతక్క వార్నింగ్..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** బీఆర్ఎస్ పార్టీకి మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్ అన్న బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమను దండుపాళ్యం బ్యాచ్ అని మరోసారి అంటే దంచికొడతామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రచారం చేసిన సీతక్క మాట్లాడుతూ.. గులాబీ నేతలపై నిప్పులు చెరిగారు. అసలు దండుపాళ్యం బ్యాచ్ అంటే బీఆర్ఎస్ నాయకులేనని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ బ్యాచ్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయని అభివృద్ధిని తాము చేస్తున్నామని చెప్పారు.

## 8వ వేతన కమిషన్‌కు కేబినెట్ ఆమోదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేబినెట్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎనిమిదో వేతన కమిషన్‌కు ఆమోదం తెలిపింది. ఈ కమిషన్ 18 నెలల్లోపు సిఫార్సులను సమర్పిస్తుందని పేర్కొంది. 2026 జనవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కేబినెట్ తాజా నిర్ణయంతో 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. పే కమిషన్ ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్, సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ గోష్, పంకజ్ జైన్‌ను కేంద్రం నియమించింది.

### సంప్రదింపుల తర్వాత..

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సిబ్బందితో సంప్రదింపుల తర్వాత పే కమిషన్‌ను ఖరారు చేసినట్లు తెలిపారు. వేతన సంఘం ఏర్పాటుపై రక్షణ, హోం మంత్రిత్వ శాఖలు, సిబ్బంది మరియు శిక్షణ శాఖ, అలాగే రాష్ట్రాలు వంటి ప్రధాన వాటాదారుల నుంచి గతంలోనే కేంద్రం సమాచారం కోరింది. ఈ క్రమంలో తాజాగా పే కమిషన్ ఏర్పాటు చేశారు.

## హరీశ్‌రావుకు కేసీఆర్ పరామర్శ..

**అక్షరటుడే, హైదరాబాద్ :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి, తన బావ అయిన తన్నీరు సత్యనారాయణ రావు భౌతిక కాయానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యనారాయణరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన సోదరి లక్ష్మితో పాటు మేనల్లుడు హరీశ్‌రావును పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మంగళవారం వేకువజామున కన్నుమూశారు. కాగా.. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంతాపం ప్రకటించారు.



## బాలయ్య బ్యూటీకి గోల్డెన్ ఛాన్స్..

**లెజెండ్, పండుగ చేస్కో, సైజ్ జీరో వంటి చిత్రాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ సోనాల్ చౌహాన్ మళ్లీ వార్తల్లో నిలిచింది. ఈసారి ఆమె బాలీ వుడ్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలో నటించనున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియోలో సంచలనం సృష్టించిన 'మీర్జాపూర్' వెబ్ సిరీస్ ఇప్పుడు సినిమాగా రూపుదిద్దుకుంటుండగా, అందులో సోనాల్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించగా.. సోనాల్ కూడా తన సోషల్ మీడియా ద్వారా ఈ ఆనందాన్ని పంచుకున్నారు. "ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో భాగం కావడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. మీర్జాపూర్: ది ఫిల్మ్ నా కెరీర్‌లో కొత్త మైలురాయిగా నిలుస్తుంది" అని ఆమె పేర్కొన్నారు.**

—అక్షరటుడే, సినిమాడెస్క్

